# ఆమె పెదవులు

బస్సులో బందరు వెడుతున్నాము. ఉయ్యూరు దగ్గిర శంకరం.

"చూడరా' ముందు కూచున్న ఆమె తిరిగి తిరిగి నిన్నెట్లా చూస్తోందో!" అన్నాడు.

"ఛీ, పో! నిన్నే" అన్నాను.

"కాదురా, నిన్నే చూడు."

నేనూ తల తిప్పాను. నిజంగా నావంకనే చూస్తోంది. కళ్ళతో నా కళ్ళను ఆపింది. ఆమెకు నలభై యేళ్ళుంటాయి. గుండ్రంగా, చామనచాయగా వుంది.

"ఛీ, అంత పెద్దామె. నీ కేమన్నా మతి పోయిందా?" అన్నాను, పైకి మర్యాదకి.

"చూస్తోందా లేదా?"

సిగ్గుపడ్డాను.

"నా వంటి కొడుకో, అల్లుడో ఉన్నాడేమో" అన్నాను సమర్థించుకోవడాని కని.

"లేక భర్తో!.... ...."

"అట్లా అనకు."

"భర్త చిన్నప్పుడు, నీ అంతవాడుగా ఉండే టప్పుడు నీవలె ఉండేవాడేమో!"

"నమ్మను."

"నమ్మ నేమిటి? ఒకసారి కొల్లూరినించి నేను స్టేషనుకి జట్కాలో వాస్తోంటే యిట్లాంటిదే జరిగింది."

"వింటోందిరా."

"సరే, బస్సాగనీ."

బందరులో యింటికి మనుషులులేని రోడ్డుమీద దీపాల కింద నడుస్తో ఆ కథ చెప్పాడు;-

"మా బండి ఇంకో బండి నందుకుంది. దాంట్లో నలుగురు మనుషు లున్నారు. చివరి ఆమె ఒక ముసలి ముత్తయిద; యాభైయే ళ్లుంటాయి. తలంతా నెరిసింది. కాని మొహాన ముడతలు లేవు. పెద్ద కుంకుమ బొట్టూ, కళ్లకి కాటికా వున్నాయి. ముఖం కోల. చిన్న తనంలో ఎంత అందంగా ఉండి ఉండాలో అని యోచించుకుంటో చూస్తో, ఆమె కూడా ఆ కాటిక కొలుకుల చివర్లనించి నన్ను చూడడం కనిపెట్టాను. సంబంధం లేనివాణ్ని చూసే దృష్టికి, అర్థంతో చూసే దానికీ స్పష్టమయిన బేధమున్నదని, నువ్వూ కనిపెట్టావు కద! కాని నా కింకా ఆ అనుభవం లేదప్పుడు. బండి దిగగానే అమె వెంట ఆమె భర్త నల్లని గుండువంటి మనిషి దిగాడు. యింకెవ్వరూ లేకపోవడం చేత నాతో మాటలు ప్రారంభించాడు. ఆయన భుజం వెనకనించి ఈమె నన్ను కళ్ళతో కొడుతోనే ఉంది. అట్లానే రైల్లో ఒక పెట్టె లోనే యెక్కాం.

రైలు కదలగానే

"నీకు పెళ్ళయిందా నాయనా!" అంది.

త్వరలోనే బంధుత్వం కలిసింది మాకు. మా బాబాయి అత్త వారికి దగ్గర చుట్టాలట వీళ్ళు. ఆమె అందమంతా, ఆకర్షణంతా, ఆమె పెదవుల్లో ఉన్నదని గ్రహించాను. శరీరాన్నంతా జయించిన వృద్ధాప్యం ఆమె పెదవు ల్నంటక వొదిలింది. పదహారేళ్ళప్పు డెట్లా ఉన్నాయో, అనాడూ అట్లానే ఉన్నా యాతీర్చిన పెదిమలు. మాట్లాడితే, చిరునవ్వ

నవ్వితే, ఆ పై పెదవు పక్కగా సగం పైకి తెరుచుకొని, తెల్లని పళ్ళు కనపడి, మనసులో ఎక్కడో బాధ పెడుతుంది.

వాళ్ళిద్దరూ నన్ను బలవంతం చేసి దుగ్గిరాలలో దింపారు. దగ్గిర పలెటూరికి పోవడానికని బండిలో ఎక్కాం. చీకటయింది. పొలాల్లో కీచుమని ధ్వనులు వొస్తున్నాయి. ఇంటికి పొయ్యేముందు, పిట్టలు గింజ లేరుకుంటున్నాయి. దూరంనించి అప్పుడప్పుడో కాకి చెవుల్ని జల్లు మనిపిస్తోంది. మెత్తని కాంతి లోకాన్నావరించింది. ఒక్క నక్షత్రం తూర్పున పొడిచింది. ఆయనముందే నా బుజం మీద చేతు లేసుకుని, బండి వూగినప్పుడల్లా నావేపు వూగింది ఆమె. గట్టిగా అదుముకుంది. నాకు కులాసాగా వుంది గాని, చీకట్లో నాకళ్లు ఆయన ముఖం మీదనే ఉన్నాయి- ఏం చూసి ఏం చేస్తాడో అని. బండి దిగాము. వాళ్ళింటికి అతిధిని కద; భోజనంచేసి పడుకుని ఆలోచించు కుంటున్నాను. నన్నెందుకు తీసుకొచ్చారా? రావడం అవివేకమా? రాత్రి చంపుతారేమో! చిన్నప్పుడు విన్న కథలు జ్ఞాపకం వచ్చాయి. ఏం లాభం చంపి? పర్సులో ఉన్న పదణాల కోసమా? నేను చస్తే వీళ్ళకి వచ్చే ఆస్తిలేదే? నాకు ఉంటేగా మొదలు! ఆమె చర్య-ఆయన ముందు? అదేమిటి? అంత ముసలామెని చూస్తే నాకు అసహ్యం ఎందుకు కలగలేదు? చివరికి నా Taste ఇంత అధోగతి పాలయిందా? కాని ఆమె పెదవులు....తలుచుకున్న కొద్దీ ఏదో వింతకోర్కి కలిగింది. ఆమె పెదవులు మాత్రమే, వాటి అందం మాత్రమే తీసుకో గలిగితే! ఎట్లా? ఈ లోకంలో గొప్పగొప్ప వేదాంతుల్ని కలతపెట్టిన సమస్యే నన్ను బాధించింది. అందంకొసం వొస్తువుని అంగీకరించాలి. అవస్తువుని ఛిద్రం చేసుకోవాలి. ఇతరులకి దక్కనీ కూడదు. ఎవరన్నా సొంతంచేసి దాచుకుంటారనే భయంవల్లనే ఆకాశం అంత దూరంగా పోయింది. వెన్నెల యెక్కడా యిమడదు.

చక్కని బుజాల సౌందర్యం నాకు కావాలంటే నేను ఆ బుజాల్ని మాత్రం కొనుక్కోడానికి వీల్లేదు ఆబుజాలతోపాటు తక్కిన అందం ఏమీలేని ఆ స్త్రీని, ఆమె చీకిరి కళ్ళని, వంకర నడుముని కూడా తెచ్చుకోవాలి. శరీరమంతా అందంగా ఉన్న స్త్రీతోబాటు, ఆమె

గర్వమూ, ఆమె రాకాపిశనమూ; చంచలత్వమూ కూడా కొంచెక్కా వాలికదా! పైగా కొన్ని దేశాల్లో ఆమె పిల్లల్నికూడా తెచ్చి పోషించాలి. ఈ అవయవాలన్నీ, యంత్రశషభాగాల్లాగ, (Spare parts) దొరుకుతోవుంటే, ఈ లోకంలో సమస్యలు చాలా అంతమవుతాయి. ఆలోచనమీద (Developments) చాలా విచిత్రమైన సంఘటనలని తోపిస్తాయి మనసుకి. ఒక రాత్రంతా నిద్రపట్టనప్పుడు ఆలోచించుకో. పక్కన ఎవరూ లేకుండా చూడు. ఎందుకంటే ఒకటే నవ్వు వొస్తుంది! ఇట్లా ఆలోచించుకుంటో నిద్రపోయినాను.

అర్ధరాత్రి నన్నెవరో కావిలించుకొన్నారు. నాకు పదిహేడేళ్లు లేవు; అంతవరకు కేమీ అనుభవం లేదు. ఆ విపరీతాన్ని, అసహ్యాన్నీ సహించలేక వొద్దన్నాను. ఆమె పనిమీద ఆమె వుంది. లేచి తోసేసి, ఎట్లాగో తప్పించుకొని బైటపడి సావిట్లో చుట్ట కాల్చుకుంటూ కూచున్న భర్తని చూశాను. మాట్లాడకుండా, చలనం లేకుండా, కను రెప్ప వాల్చకుండా కూచున్నాడు మహానుభావుడు. వాళ్ళిద్దరూ కలిపి నన్ను మోసపుచ్చినట్టు కోపమొచ్చింది నాకు.

"స్వామీ, తమ రుండికూడా ఇదే మన్యాయం?" అన్నాను. ఆయన మొహం చిట్లించుకుని మాట్లాడకుండా వూరుకున్నాడు. నేను బైటికి వెళ్ళి నుంచున్నాను. ఆమె వొచ్చింది. కుంకేచంద్రుడి యెర్ర కాంతిలో ఆమె మొహం చూసేప్పటికి నాకాశ్చర్యం వేసింది. పది హేను సంవత్సరాలు చిన్నదయింది. అంతామె నాచెయ్యి పట్టుకుని ఏడిస్తే, ఆ తీర్చిన పెదవులు వొణికితే, ఆ పూవులాంటి పళ్ళవరస చూపితే, నా వొళ్ళు మరిచాను, నా అసహ్యాన్ని మరిచాను. ఆ ముస లామె గుర్తే లేదు. తక్కిన శరీరమే కనపళ్లేదు. నా శక్తిలో లేని ఒక పెద్ద శక్తి, పిశాచంవలె నన్ను లోబరుచుకుంది. ఆమెను పెదవుల మీద అదేఅదే ముద్దు పెట్టుకున్నాను.

మర్నాడు యీ వ్యవహారమంతా శ్రీనివాసరావుగారితో చెపితే ఆయన, వొకటే నవ్వు. ఆ వయస్సులో ఇల్లాంటి విపరీత అనుభవం, ఇంకోళ్ళతో చెప్పుకోకండా వుండగలమా?"

"ఆమె నెరగవురా! ఆమెకోసమే, ఆ బోర్డు ప్రెసిడెంటు వచ్చింది!"

నాకు వాడిమీద గౌరవం హెచ్చింది.

"ఆ భర్తేనా చంపింది?"

"ఛా, వాడి మొహం! దాని ప్రియులు ముగ్గురు. సాక్ష్యం లేక కొట్టేశారు."

"ఏమిటి, మన నరసయ్య మీద కూడా?"

"అదే!"

"నరసయ్యే!"

సాయంత్రం నరసయ్యదగ్గరికి వెళ్ళి నా సంగతేమీ చెప్పక, ఆమెని గురించి అడిగాను. కాని వాడేమీ చెప్పలేదు. మళ్ళీ ఒకటి రెండు సార్లు, ఆమె పెదవులు తలుచుకుని వెళ్దా మనుకున్నాను. కాని హత్యా, ముగ్గురు గూఢ ప్రియులూ, కీచకుని అవస్థా తలుచుకుని వూరుకున్నాను.

తరువాత మొన్న మొన్న కనపడి నరసయ్య అత్తాత్తుగా, ఏదో దేశ విప్లవం కలిగినట్లు ముఖమూ, కంఠస్వరమూ పెట్టి, 'పోయింది' అన్నాడు.

ఎవరో రాణో, జగన్మాతో అనుకున్నాను.

"ఎవరు?"

"ఆమె."

వాడి తల్లి అనుకున్నాను—

"ఎవరు?"

"ఆ రాత్రి నిన్ను—ఆ ముసలామె."

ఒక నాలుగు నిమిషాలాలోచిస్తేగాని జ్ఞాపకం రాలేదు. కాని ఆ రాత్రి సంగతి వీడి కెట్లా తెలుసు? అడిగాను.

"నా కప్పుడే తెలుసు."

వీడి తప్పేగొయ్యా!

"మంచి పనయింది."

"నీకు సంతోషమెందుకు? అట్లాంటిమనిషిని యెన్నడన్నా చూస్తావా?" అని వూటలూరుతో కొంతసేపు విభ్రాంతుడై, ఏమిటో తలుచుకుంటో నన్నూ, లోకాన్ని మరచి పోయినాడు.

"యిప్పుడన్నా చెపుతావా?" అన్నాను.

"ఒకరోజు చెరువుకట్టన కనపడి...."

"నాయింటికిరా, అంది."

"మొదటిమాటే అదా!"

"అవును. అందుకేగా అసాధారణమైన అవతారమన్నేది నేను! అసలు జన్మయెత్తింది ఆవిధంగా! జన్మయెత్తింది అందుకోసం! ఇంక మాయలూ, మర్మాలూ, అబద్ధాలూ యెందుకు? అనుకుంది. తనకి కావలిసింది అది! ఆమె కొక్కర్తెకేనీ? అందరికీనీ, కాని అందరూ వొప్పుకుంటారా? ఎంత సిగ్గు, ఎంత నటన, ఎంతమోసం, యెన్ని అబద్ధాలూ! ఏదో తమ కేమి యిష్టంలేనట్టూ, యెవరిదో బలవంతమైనట్టూ, మన పతివ్రతలూ, నీతి వంతులూ, సరే సరి. అసలువాళ్ళకి ఆ అవయవాలు లేకుండానే పుట్టినట్టూ, వున్నా, వాటి నెన్నడూ అట్లాంటి పాపపు పనులకు ఉపయోగించనట్టే మాట్లాడతారు కద?

"ఇంక...."

"సరేలే! అసలు కథ చెప్పు."

"వెళ్ళాను! తెలిసింది. అసహ్యమేసింది. వెళ్ళిపోబోతున్నాను. చేతులో మూడురూపాయలు పెట్టింది."

"రామ రామ!"

"ఏం? రామ రామా అంటావు? మొగవాళ్ళు పొలాలు వ్రాసిస్తే రామ రామా అనవేం? ఆడదాని అవసరం అట్లాంటిది కాదేం?"

"సరేలే!"

"రోజుకి మూడణాలు సంపాయించుకునే ముండాకొడుక్కి అంత సులభంగా...."

"సరేలే"

"నీకేం యిష్టంగా లేనట్టుందే వినడం? బావుంది! నువ్వడిగితే చెపుతున్నానా? లేకపోతే నీ కంత యిష్టంలేకపోతే...."

"కు ప్తంగా కానీ" అన్నాను.

"ఓ. వెళ్లేటప్పుడు నవ్వి "మళ్ళీ యెప్పుడు?" అంది. ఆ పెద వుల్ని చూశాను. నువ్వూ చూశావు. అంతే, ఆయింటికి కుక్కనై పోయినాను."

"మరి ఆముసలిదానికి...."

"చూశావా? ఎన్ని ప్రశ్న లేస్తావో? మళ్ళా నన్ను క్లుప్తంగా మాట్లాడ మంటావు. లోకం సంగతేఅంతలే! అంతా రట్టూ! రహస్యం. ప్రతిదీ తెలుసుకోవాలనే వుబలాట! పైగా ఆరహస్యాలూ చెప్పేవాణ్ణి వ్రాసేవాణ్నీ, అంతా విని చివరిదాకా చదివి, బూతులు వ్రాశాడని తిట్టడం. ఆతిట్లతో ఆపాపం పరిహార మయిందని తృప్తి. తమచేత వినేట్టు చేశారనీ, చదివేట్టు చేశారనీ తాము బుద్ధిమంతులమేననీ, సమర్ధనలు"

"నిజమేలే చెప్పు"

"ఆమా! ఒక్కొక్కరిది ఒక్కొక్క విధమైన జన్మ స్వభావం. ఒకడు కోపిష్టి, ఒకరు రోగిష్టి, ఒకరు భోగిష్టి, ఒకరికి ఆశలెక్కువ, ఒకరికి లోభ మెక్కువ, ఒకరికి కామ మెక్కువ, ఒకరికి నగలమీద పిచ్చి, ఒకరికి నాటకాలమీద వెర్రి, ఒకరికి తోటలంటే అభిమానం, ఒకరికి మనుషు లవసరం. ఏం చెపుతాం? లోకం అనంతం. ఎనభై యేళ్ళ మొగాడు తన కింత కామ శక్తి ఉందనీ, భార్యలు కావాలనీ, వేశ్యలు కావాలనీ అంటే, అదో గౌరవం. స్త్రీ అంటే! అందుకేగా యీ మెని నేను...."

"సరేలే! ఆభర్త"

"ఆయన చాలా మహానుభావుడు. ఆమెమీద ఆయనకి ఎంత యిష్టమంటే, ఆమె యేంచేసినా...."

"అదేం ప్రేమరా?"

"అదేగా మహా వ్యక్తుల ఔన్నత్యం! శ్రీకృష్ణుడు ఏం చేసినా రుక్మిణి ఊరుకోలా?"

పదివేలమంది భార్యలుంటేనేం? తనని పట్టమహిషిగా అంగీకరించాడు. తన యింటికి ఏ పదేళ్ళకో ఓసారి వస్తాడు. రోజూ ఒకసారి

ముఖదర్శన మవుతుంది. శ్రీకృష్ణుడి భార్య అంటాను. అదే పరిలక్ష అనుకుంది. దక్షిణనాయకులంటే యేమిటి? ఈమె దక్షిణ...... ...."

"తెలిపింటలే! తరవాత!"

"ఆమె యింటికి యింకా యిద్ద రొచ్చేవారు. ఎంతమంది వొస్తేనేం! ఆమె అనుగ్రహించడమే మహాభాగ్యం. ఆమె పెదవుల మీదనించి ఒక్కసారి ఆనందంతో నిన్ను మెచ్చి చిరునవ్వు నవ్విందంటే, ఒరే ఇంక స్వర్గమెందుకు? ఒరే, కుర్రాడివిగాని ఓసంగతి చెపుతా విను. ఈ పని సర్వసాధారణం. ఈ నీతివాదులెంత తోసేసినా, యీ లోకం సాగడంకోసం ముఖ్యావసరం. జీవులన్నిటిసీ సామాన్య మనుకో, కాని ఆయావ్యక్తుల్ని బట్టి ఎంత బేధం వుందనుకున్నావురా! ఏమాత్రం ఆనందమూ లేకుండా, మామూలుగా ముక్కుతుడుచుకున్నట్టు, నిద్రపోయినట్టు, అయిపోవడమూ వుంది. ఏముంది? ఏమన్నా మెప్పొ గొప్పొ! మాటా పలుకా?"

ఏదో తమ కేం సంబంధంనలేట్లు కాళ్ళూ చేతులు వప్పచెప్పి వూరుకుంటారు యీ పుణ్యసతులు.—కాని కొందరే, ఏ కొద్దిమందో వుంటారు - ఆర్టిస్టులు - వాళ్ళని ఆనందపరిచావా, వారినించి వుత్సాహాన్ని పొందావా, వారి మెప్పును చూరగొన్నావా, ఒరే, యింక దేవేంద్రభోగా లెందుకురా, రంభా, వూర్వశీ అంటారే, వాళ్ళకివన్నీ తెల్పిదేమో! ఆరహస్యం తెలిసేనేమో, యీ ఆచారపరులూ, నీతిపరులూ, ఆచార్యులు, అందరూఆ లోకానికై ఆశించడం అనుకుంటాను" అంటూ కవిత్వంలోపడ్డాడు నరసయ్య.

"ఒకరోజు హనుమంతురావు, ప్రెసిడెంటు లేడూ-అతన్ని తెచ్చింది. ఎవ రొస్తేనేం? ఏమాత్రమూ తగాదాలులేవు అంతవరకు, మాలో మాకు. ఆమెలో గొప్పతనం ఏమిటంటే, గొప్పవాడికీ, బీదవాడికీ, ఏమీ బేధభావం చూపేది కాదు. ఇతగాడు తన దర్జాకి లోపమనుకున్నాడో యేమో, మేం రాకుండా కావిలి పెట్టాడు. కాని ఆమె మరవలేదు మమ్మల్ని. ఇంకొకటీరా-ఎవరన్నా అమెయింటికి వాళ్ళంతట వాళ్ళు రావడం మానవలసిందే గాని...... ...."

"అదీ వో సుగుణమే నంటావా?"

"ఏం? డబ్బూ, అన్నమూ అడగనివాడిది పాపం! అంత దాన కర్ణుడంటారే! ఈ విషయం వొచ్చేప్పటికి మాత్రం—"

"నీతో వాదించి యేంలాభం లే. నీకు పిచ్చెక్కింది కానీ"

"అంతే, వాడు మమ్మల్ని కొట్టించాడు. అదీ సహించాం. కాని ఓ రోజు ఆమెని కొట్టాడు దాంతో మా రక్తం రక్తానికి అరిచింది. చంపేశాం."

"అంతకన్న గొప్ప గుణం ఎవరిలో నన్న యోచించుకో గలవా? మహ మునులకన్నా వుండదు."

———